RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 224 | సంపుటి 4 | శనివారం | 02-05-2026 | పేజీలు 4 | వెల 3/-



## సామాన్యుడిపై చమురు భారం

- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం
- హర్మూజ్ జలసంధి మూసివేతతో సరఫరాకు ఆటంకం
- రికార్డు స్థాయిలో ముడిచమురు ధరలు
- బ్యారెల్ ధర 126 డాలర్లకు చేరడంతో తప్పని పెంపు
- చమురు సంస్థలకు పెట్రోల్ పై రూ. 20, డీజిల్ పై రూ.100 చొప్పున నష్టాలు
- ఎన్నికలు పూర్తియిన వెంటనే ధరల పెంపునకు రంగం సిద్ధం

2

అంతర్జాతీయ మార్కెట్ లో నెలకొన్న ఉద్రిక్తతలు దేశీయంగా ఇంధన ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఫలితంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. రానున్న వారం రోజుల్లో లీటర్ పై ఏకంగా రూ. 25 నుంచి రూ. 28 వరకు ధర పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు సంకేతాలిస్తుండటం సామాన్యులను ఆందోళనకు గురిచేస్తోంది. — హైదరాబాద్, ప్రభాత గమనం



2

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతి
- యాదగిరిగుట్టకు వెళ్లొస్తుండగా ఘటన
- ఓఆర్ఆర్ పై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- ప్రమాదంలో ఆరుగురు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రికి తరలింపు



3

## ఘనంగా మే డే

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. వివిధ కార్మిక సంఘాలు, సంస్థలు ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, సభలు ఏర్పాటు చేసి శ్రమజీవుల ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా కార్మికులు తమ హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి కార్మికులే వెన్నెముకగా నిలుస్తారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు, మహిళా కార్మికులు, సంఘాల ప్రతినిధులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## మే ఆఖరే డెడ్ లైన్

- అసంపూర్తి నిర్మాణాలకు ఇందిరమ్మ పథకం ద్వారా నిధులు
- గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల విడుదలకు సర్కార్ నిర్ణయం
- కాంట్రాక్టర్లు వదిలేస్తే సొంతంగా పూర్తి చేసేలా అవకాశం
- ప్రతి ఇంటికి 40 టన్నుల ఇసుక..
- అనర్హులుంటే తక్షణమే ఖాళీ చేయించాలి
- అర్హుల జాబితా బాధ్యత కలెక్టర్లదే..
- సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి

2



"రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, మే చివరి నాటికి లబ్ధిదారులకు అందజేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, ఎక్కడా అవినీతికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు . కాలనీల్లో మౌలిక వసతుల కోసం రూ.400 కోట్లు వెచ్చిస్తూ, నివాసయోగ్యమైన ఇళ్లను అందించడమే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ఇళ్ల నిర్మాణంలో నిధుల మంజూరులో నిర్లక్ష్యం వహించే అధికారులపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బిల్లుల చెల్లింపులో అక్రమాలకు పాల్పడితే సర్వీసు నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేస్తూ, మే చివరి నాటికి ఇళ్ల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ రంగంలో నిలిచిపోయిన పనులకు ప్రభుత్వం సరికొత్త ఊపిరి పోసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిధులను జోడిస్తూ, గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి కీలక నిర్ణయం తీసుకున్నారు.

# మే ఆఖరే డెడ్ లైన్

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి ముహూర్తం ఖరారు
- అసంపూర్తి నిర్మాణాలకు ఇందిరమ్మ పథకం ద్వారా నిధులు
- గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల విడుదలకు సర్కార్ నిర్ణయం
- కాంట్రాక్టర్లు వదిలేస్తే సొంతంగా పూర్తి చేసేలా అవకాశం
- రూ. 400 కోట్లతో కాలనీల రూపురేఖలు
- డ్రైనేజీ, కరెంట్, నీటి వసతుల కోసం భారీ కేటాయింపు
- ప్రతి ఇంటికి 40 టన్నుల ఇసుక..
- బిల్లుల్లో చేతివాటం చూపిస్తే సర్వీసు నుంచి తొలగింపు
- డబుల్ బెడ్రూం ఇళ్లలో అనర్హులుంటే తక్షణమే ఖాళీ చేయించాలి
- అర్హుల జాబితా బాధ్యత కలెక్టర్లదే..ఎంపికలో రాజీ పడొద్దు
- సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్ (ప్రభాత గమనం ప్రతినిధి):

రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి, మే చివరి నాటికి లబ్ధిదారులకు కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### ఇందిరమ్మ పథకం ద్వారా నిధులు

అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు మిగిలిన పనుల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిధులు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఒకవేళ కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తే, లబ్ధిదారులే స్వయంగా పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని, వీటికి గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో విద్యుత్, తాగునీరు వంటి వసతుల కోసం రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. అనర్హుల చేతుల్లో ఉన్న ఇళ్లను ఖాళీ చేయించి, అసలైన లబ్ధిదారులకు అప్పగించాలని కలెక్టర్లను ఆదేశించారు.

### కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు లేదు

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని, రెవెన్యూ మరియు అటవీ భూముల సరిహద్దు వివాదాలకు సంయుక్త సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని పొంగులేటి ఆదేశించారు. ఇదే క్రమంలో కొత్తగా రెవెన్యూ డివిజన్లు లేదా మండలాలను ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు.

### ఇందిరమ్మ ఇళ్లు - ఉచిత ఇసుక

ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని, ఇది దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి పేర్కొన్నారు. నగరానికి దూరంగా ఉన్న ఇళ్ల విషయంలో లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారికి నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు కేటాయించేలా కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు.

### సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ ప్రారంభం

హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 30 కేవీ సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. దీని ద్వారా నెలకు 4,500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా కార్యాలయ విద్యుత్ ఖర్చులు తగ్గుతాయని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు.



# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతి
- యాదగిరిగుట్టకు వెళ్లొస్తుండగా ఘటన
- ఓఆర్ఆర్ పై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- ప్రమాదంలో ఆరుగురు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రికి తరలింపు

హైదరాబాద్ (ప్రభాత గమనం):

హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు (ORR)పై శనివారం వేకువజామున పెను విషాదం చోటుచేసుకుంది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందారు. ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్న సిరిసిల్లకు చెందిన ఏడుగురు కుటుంబ సభ్యులు తమ కారులో యాదగిరిగుట్ట క్షేత్రానికి వెళ్లారు. దైవదర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా, ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్-16 (పెద్దగోల్కొండ - శంషాబాద్ మధ్య) సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు అత్యంత వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉండటం అందరినీ కలిచివేసింది. ప్రమాదంలో మరణించిన వారిని శ్రీనివాస్, శివ, శ్వేత, కృష్ణచంద్ర (చిన్నారి), మాధవ్ (చిన్నారి), రిషిత (చిన్నారి)గా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన లాస్య అనే మహిళను స్థానికులు, పోలీసులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

### అలసటే ప్రమాదానికి కారణమా?

ప్రమాద స్థలాన్ని చేవేళ్ల డీసీపీ యోగేష్ గౌతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వ్యాగనార్ డ్రైవర్ తీవ్ర అలసటకు గురై నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం. కారు అతివేగంతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం" అని తెలిపారు. సిరిసిల్ల స్వస్థలమైన ఈ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడి, ఇలా దైవదర్శనం చేసుకుని వస్తూ అనంతలోకాలకు వెళ్లడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

# బాధితులకు భరోసా కల్పించాలి

**సీపీ సన్‌ప్రీత్ సింగ్**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలకు న్యాయం అందించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి వ్యక్తిలో "ఇక్కడ న్యాయం జరుగుతుంది" అనే విశ్వాసం కలిగేలా అధికారులు పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తూ, ఇటీవల ఏసీపీలుగా పదోన్నతి పొందిన గొర్ల సీతారెడ్డి, బోలగాని శ్రీనివాస్ గౌడ్, సార్ల రాజు సీపీ క్యాంపు కార్యాలయంలో పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా, బాధ్యతలను మరింత విస్తరింపజేస్తాయని పేర్కొన్నారు. ఉన్నత హోదాలో పనిచేసే అధికారులు తమ పరిధిలోని క్రింది స్థాయి సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, వారికి తగిన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అలాగే, పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ఠలను మరింత పెంపొందించేలా ప్రతి అధికారి కర్తవ్యనిష్ఠతో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, వారి సమస్యలను సానుభూతితో విని పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే, ప్రతి అధికారి నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగాలని సీపీ సన్ ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

# నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తాం...

మహబూబాబాద్ మే1(ప్రభాత గమనం)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో శనివారం, ఉదయం 9:00 గంటలకు జిల్లాలోని నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ స్నేహ శబరిష్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ నియోజకవర్గ సమావేశం పట్టణంలోని వివిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గం సమావేశం మరిపెడ బంగ్లా భార్గవ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాలలో నియోజకవర్గస్థాయిలో ఉన్నటువంటి అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, అన్ని శాఖల సంబంధిత అధికారులు పాల్గొంటారని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.



# సామాన్యుడిపై చమురు భారం

- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం
- హర్మూజ్ జలసంధి మూసివేతతో సరఫరాకు ఆటంకం
- రికార్డు స్థాయిలో ముడిచమురు ధరలు
- బ్యారెల్ ధర 126 డాలర్లకు చేరడంతో తప్పని పెంపు
- చమురు సంస్థలకు పెట్రోల్‌పై రూ. 20, డీజిల్‌పై రూ.100 చొప్పున నష్టాలు
- ఎన్నికలు పూర్తియిన వెంటనే ధరల పెంపునకు రంగం సిద్ధం

హైదరాబాద్ (ప్రభాత గమనం):

దేశంలోని వాహనదారులు, సామాన్య ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు రికార్డు స్థాయికి చేరడంతో, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచక తప్పని పరిస్థితి నెలకొందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు సంకేతాలిస్తున్నాయి. రానున్న ఐదు నుంచి ఏడు రోజుల్లో లీటర్ ఇంధనంపై ఏకంగా రూ.25 నుంచి రూ.28 వరకు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



### ధరల మంటకు కారణమేంటి?

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ చమురు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తోంది.

**హర్మూజ్ జలసంధి దిగ్బంధం:** ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

**భగ్గుమంటున్న క్రూడాయిల్:** గతేడాది బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, తాజా ఉద్రిక్తతలతో ఈ వారం ఏకంగా 126 డాలర్లకు చేరింది. ప్రస్తుతం కాస్త తగ్గి 110 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### చమురు సంస్థలకు భారీ నష్టాలు

గడిచిన నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచిన ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (OMCs) ప్రస్తుతం తీవ్ర నష్టాలను మూటగట్టుకుంటున్నాయి. చమురు మంత్రిత్వ శాఖ అధికారి సమాచారం ప్రకారం.. ప్రస్తుతం దేశీయ సంస్థలు లీటర్ పెట్రోల్‌పై రూ.20, డీజిల్‌పై రూ.100 వరకు నష్టం పొందుతున్నాయి. నష్టాలను పూడ్చుకోవడానికి ఇప్పటికే కమర్షియల్ ఎల్పీజీ, విమాన ఇంధన (ATF) ధరలను పెంచినప్పటికీ, సామాన్యులపై ప్రభావం చూపే పెట్రోల్, డీజిల్ ధరలను మాత్రం పెంచలేదు.

### ఎన్నికల తర్వాతే పెంపు?

నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో, ఇక ధరల పెరుగుదల అనివార్యమని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. పెట్రోల్/డీజిల్ లీటర్‌పై రూ.25 నుంచి రూ.28 వరకు పెరిగే ఛాన్స్. వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.40 నుంచి రూ.50 వరకు పెంచే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఢిల్లీలో పెట్రోల్ లీటర్ రూ.94.77, డీజిల్ రూ.86.67గా ఉంది. ఒకేసారి రూ.25కు పైగా ధర పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మాజీ మావోలతో మల్లన్న చర్చలు



హైదరాబాద్ మే1(ప్రభాత గమనం):

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంటున్న పరిణామంగా, మాజీ మావోయిస్టులతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుక్రవారం నాడు సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. సమాజంలో మార్పు కోసం ఆయుధ పోరాటం నుండి ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకున్న ఈ నాయకులతో మల్లన్న విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ..తెలంగాణ రాజ్యాధికార పార్టీ బీసీల రాజ్య సాధనే లక్ష్యంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ కట్టుబడి ఉందని వివరించారు. బీసీ వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా సరైన ప్రాతినిధ్యం కల్పించడమే పార్టీ ప్రధాన ధ్యేయమని తెలిపారు. మాజీ మావోయిస్టులు కూడా మల్లన్న ఆలోచనలకు, పార్టీ విధానాలకు మద్దతు తెలుపుతూ, ప్రజాస్వామ్య మార్గంలో ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో తీన్మార్ మల్లన్న సమక్షంలో వారు అధికారికంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ చేరికలతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మరింత బలపడుతుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాటం కొనసాగిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# కుటుంబాన్ని చిదిమేసిన షాపింగ్ వివాదం

- భార్య క్షణికావేశ నిర్ణయంతో కుటుంబం బలి
- ఖమ్మం నగరం మామిళ్లగూడెంలో సంచలనం రేపిన ఒకే కుటుంబం మరణాలు
- పోస్టుమార్టం తరువాతనే పూర్తి వివరాలు తెలుస్తాయంటున్న పోలీసులు
- కన్న తల్లి పిల్లలను చంపి ఉంటుందని అనుమానాలు



ఖమ్మం (ప్రభాత గమనం):

క్షణికావేశం ఒక నిండు సంసారాన్ని కూల్చివేసింది. చిన్న కుమార్తె పుట్టు వెంట్రుకల వేడుకల కోసం చేసిన షాపింగ్‌లో తలెత్తిన చిన్న గొడవ, నలుగురి ప్రాణాలు తీయడానికి దారితీసింది. ఖమ్మం నగరం మామిళ్లగూడెంలో ఐదు రోజుల క్రితం వెలుగుచూసిన ఈ విషాద ఘటనలో, హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి రితిక (3) గురువారం రాత్రి కన్నుమూయడంతో ఆ కుటుంబంలో ఎవరూ మిగలకుండా పోయారు.

### అసలేం జరిగింది?

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని మామిళ్లగూడెంలో నివసించే కణతాల రాము (30), రమ్య (28) దంపతుల మధ్య చిన్న కుమార్తె పుట్టు వెంట్రుకల వేడుక షాపింగ్ విషయంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో గత నెల ఏప్రిల్ 26న రాము బయట పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి ప్రాణాలు విడిచాడు. భర్త మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన రమ్య, అమానవీయ నిర్ణయం తీసుకుంది. తానూ ఆత్మహత్య చేసుకోవాలని భావించి, తన ఇద్దరు కుమార్తెలను చంపేందుకు పూనుకుంది. పెద్ద కుమార్తె దివ్యశ్రీ (5)ని హత్య చేయగా, చిన్న కుమార్తె రితికకు బలవంతంగా ఎలుకల మందు తాగించింది. అనంతరం తానూ మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది.

### వరుస మరణాలు

పోలీసుల దర్యాప్తు మరియు చికిత్స క్రమంలో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం: ఏప్రిల్ 26న రాము (30), పెద్ద కుమార్తె దివ్యశ్రీ (5) మృతదేహాలను పోలీసులు ఇంట్లో గుర్తించారు. ఏప్రిల్ 27న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి రమ్య (28) మృతి చెందింది. మే 1 (గురువారం): తీవ్ర అస్వస్థతతో హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి రితిక (3) కూడా మరణించింది.

### పోలీసుల దర్యాప్తు

ఈ కేసును ఛేదించే క్రమంలో ఏసీపీ రమణమూర్తి నేతృత్వంలోని బృందం పలు కోణాల్లో విచారణ జరిపింది. తొలుత ఇవి హత్యలా లేక ఆత్మహత్యలా అన్న అనుమానాలు వ్యక్తమైనా, రమ్య మరణించడానికి ముందు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అసలు విషయం బయటపడింది. భర్త ఆత్మహత్య తర్వాత తాను పెద్ద కుమార్తెను చంపి, చిన్నారికి విషం ఇచ్చి తాను కూడా తాగినట్లు ఆమె ఒప్పుకుంది. ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు, ఫోన్ కాల్ డేటాను పరిశీలించగా ఎలాంటి బాహ్య వ్యక్తుల ప్రమేయం లేదని తేలింది. "కేవలం క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఒక కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. పోస్టుమార్టం నివేదికలు వచ్చిన తర్వాత మరిన్ని పూర్తి వివరాలు వెల్లడిస్తాం," అని ఏసీపీ తెలిపారు. రాము సోదరుడు ఉపేందర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ పార్టీ కార్యాలయంలో మేడే వేడుకలు




కేసముద్రం మున్సిపల్ కేంద్రంలో

# ఘనంగా మేడే వేడుకలు

- శ్రమజీవుల ఐక్యతకు నినాదాల హోరు
- కార్మిక హక్కుల పరిరక్షణపై సంఘాల పిలుపు
- ర్యాలీలు, సమావేశాలతో ఉత్సాహంగా నిర్వహణ
- కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతపై డిమాండ్లు
- సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి
- మహిళా కార్మికుల హక్కులపై ప్రత్యేక దృష్టి
- సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్రపై ప్రశంసలు
- కార్మిక సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అని వ్యాఖ్యలు

**అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. వివిధ కార్మిక సంఘాలు, సంస్థలు ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, సభలు ఏర్పాటు చేసి శ్రమజీవుల ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా కార్మికులు తమ హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి కార్మికులే వెన్నెముకగా నిలుస్తారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు, మహిళా కార్మికులు, సంఘాల ప్రతినిధులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.**

### మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలను కాపాడుకుందాం...

కేసముద్రం, మే1,(ప్రభాత గమనం): మే డే స్ఫూర్తితో కార్మిక చట్టాలను కాపాడుకుందామని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్, సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్ అన్నారు. శుక్రవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఏఐటీయూసీ, సిపిఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించి, పలుచోట్ల ఎర్రజెండాలను ఎగురవేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ సర్కార్ కులాల పేరుతో మతాల పేరుతో దేశంలో అరాచక పాలన కొనసాగిస్తుందన్నారు. 99% ఉన్న పేద బడుగు బలహీనవర్గాల ప్రజలను పట్టించుకోకుండా కేవలం ఒక్క శాతం ఉన్న ధనవంతులకు వత్తాసు పలుకుతుందన్నారు. అందులో భాగంగానే అనేక సంవత్సరాలు కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా విభజించి కార్మికుల శ్రమను దోచుకుంటుందన్నారు. ఈ లేబర్ కోడ్ల వలన కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలుగా పెంచుతూ కార్మికుల యొక్క పోరాటాన్ని కేంద్ర బిజెపి సర్కార్ అవమానపరచిందన్నారు. మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డే బోయిన లక్ష్మీ నరసయ్య, దాసరి సాయిలు, నల్గొండ వెంకన్న, రాజబోయిన శ్రీను, వేల్పుగొండ ఏలియా, కట్కూరి శ్రావణ్, నగేష్, కైక, వీరు నాయక్, జన్ను రాజేందర్, లింగాల శ్రీను, లైసెట్టి భాస్కర్, ఉప్పలయ్య, వెంకన్న, జిలాని, రాజు, తాటికాయల యాకయ్య, సామనపల్లి ప్రవీణ్, కుక్కమూడి బాబు, జన్ను చంటి, భూక్య శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

### అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

మహబూబాబాద్, మే 1(ప్రభాత గమనం):

చికాగో కార్మిక అమరవీరుల స్ఫూర్తితో దేశంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు, కార్మికులు, రైతు కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. 140వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో అరుణపతాకాన్ని ఎగురవేసి చికాగో కార్మిక అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమానికి పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత అధ్యక్షత వహించగా, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సనప పోమ్మయ్య ఐఎఫ్‌టియు జెండాను ఎగరవేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా మాట్లాడుతూ..కార్మిక హక్కుల కోసం చికాగోలో జరిగిన పోరాటం ప్రపంచ కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకమైందని తెలిపారు. పని గంటల తగ్గింపు, శ్రమకు తగిన వేతనం కోసం పోరాడిన కార్మికుల త్యాగాలతోనే ఎర్రజెండా ఆవిర్భవించిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక, రైతు కూలీ ఉద్యమాలకు ఎర్రజెండా దిక్సూచి అయిందని, నిరుపేదలకు బాసటగా నిలిచిందని చెప్పారు. మేడే అంటే కార్మికుల ఐక్యత, పోరాట సంకల్పానికి ప్రతీక అని అన్నారు. ప్రస్తుతం దేశంలో అమలవుతున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, కేంద్ర ప్రభుత్వం పూర్వం అమలులో ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మిక హక్కులు తీవ్రంగా దెబ్బ తిన్నాయని విమర్శించారు. ఈ మార్పులతో అనేక కంపెనీల్లో కార్మికులు రక్షణ కోల్పోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను పెద్ద కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి, ఆర్టీసీ, రైల్వే, విద్యుత్, బ్యాంకింగ్, ఎల్‌ఐసీ వంటి రంగాలను బలహీనపరచే చర్యలను ఖండించారు. రైతాంగానికి సరైన మద్దతు ధరలు కల్పించకపోవడం, విదేశీ వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ రైతులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడే స్ఫూర్తితో పాలక వర్గాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, సట్ల యాకన్న, బిక్షపతి, నర్సిరెడ్డి, భాగ్యలక్ష్మి, అనురాధ, స్వరూప, ఇరుగు నాగన్న, వీరన్న, హనుమ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్య కాలనీలో కూడా పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.




గార్ల మండలంలో

### ఎనిమిది గంటల పనిదినం.. పోరాడి సాధించుకున్న హక్కు

గార్ల, మే,1, (ప్రభాత గమనం) :

"మేడే పోరాట స్ఫూర్తిని రగిలిద్దాం.. ఎనిమిది గంటల పని విధానాన్ని ప్రాణప్రదంగా కాపాడుకుందాం" అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గార్ల మండల కేంద్రంలో సిపిఎం, సిఐటియుల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణం ఎర్రజెండాలతో నిండిపోయింది.స్థానిక మంగపతి రావు భవనం నుండి ప్రారంభమైన కార్మికుల భారీ ప్రదర్శన పట్టణ పురవీధుల్లో ఉత్సాహంగా సాగింది. డోర్నకల్ రోడ్డు, మర్రిగూడెం, పోచారం ఆటో సెంటర్, బయ్యారం రోడ్ మరియు నెహ్రూ సెంటర్ మీదుగా సాగిన ఈ ర్యాలీలో కార్మికులు తమ హక్కుల సాధన కోసం నినదించారు. దారిపొడవునా వివిధ కూడళ్లలో పార్టీ జెండాలను ఆవిష్కరిస్తూ, చివరకు స్థానిక సుందరయ్య స్తూపం వద్దకు చేరుకుని సభగా ఏర్పాటయ్యారు.ఈ సందర్భంగా కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, మాజీ ఎంపీటీసీ తెల్లబోయిన వెంకటరమణలు ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు:ఎనిమిది గంటల పని విధానం అనేది యాచించి పొందింది కాదు, ఎందరో కార్మికుల ప్రాణత్యాగాల వల్ల సిద్ధించిన హక్కు అని గుర్తు చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక చట్టాలను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలంటే కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ ఉత్సవాల్లో వివిధ రంగాలకు చెందిన కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు వి. వెంకటేశ్వర్లు, ఎ. వీరాస్వామి, కె. ఈశ్వర్ లింగం సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.యూటీఎఫ్ నాయకులు జి. భద్రు, యం. సుందర్ కుమార్.తెలంగాణ యునైటెడ్ మెడికల్ & హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి. శ్రీనివాస్.ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, హమాలీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు.వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనలతో వేడుకల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జి. గోవింద్, యం. నాగమణి, సి.హెచ్ ఎల్లయ్య, మౌనిక, బి. అప్పిరెడ్డి మరియు పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొని మేడే వేడుకలను విజయవంతం చేశారు.

### కార్పొరేట్ శక్తులపై సమరభేరి మోగిద్దాం

గార్ల, మే 01, (ప్రభాత గమనం) :

చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్పొరేట్ శక్తుల అణచివేతకు వ్యతిరేకంగా కార్మిక లోకం ఐక్యపోరాటం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు, గార్ల మండల కార్యదర్శి జి. సక్రు పిలుపునిచ్చారు. మేడే ఉత్సవాల సందర్భంగా గార్ల మండలంలోని పలు గ్రామాల్లో ఎర్రజెండాలను ఆవిష్కరించి, భారీ ప్రదర్శనలు నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభల్లో సక్రు మరియు జడ సత్యనారాయణ ప్రసంగిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి మరణశాసనం లాంటివని వారు మండిపడ్డారు.ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి (LIC), బిఎస్ఎన్ఎల్ (BSNL) వంటి సంస్థలను నిర్వీర్యం చేసి, బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పాలకులు ఎర్ర తివాచీ పరుస్తున్నారని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహమంటూ దేశ సంపదను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు.మేడే వేడుకల్లో భాగంగా గార్ల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ముందుతో పాటు.. మద్దివంచ, ముల్కనూర్, సత్యనారాయణపురం, చిన్న కృష్ణాపురం, పెద్ద కృష్ణాపురం, పిన్నిరెడ్డిగూడెం, ముత్తి తండా, పోచారం గ్రామాల్లో ఎర్రజెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌని భద్రయ్య, మల్లేష్, ఖుషిని బాబురావు, ఎర్రి రవి, జడ ఐలమ్మ, మాన్య మనోహర్, రమణ, ఉప సర్పంచ్ మంకిడి భారతి, రాధా, వాంకుడోత్ హరి, పాక వెంకన్న, పాక వీరన్న, గూగులోతు ఉపేందర్, బీజాంబి, చిర్ర పాండురంగ, మహేష్ కుమార్, అచ్చమ్మ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.




గార్ల మండల కేంద్రంలో ర్యాలీ తీస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

# ఎమ్మెల్యే దొంతివి అన్నీ జూటా మాటలే..

- రైతన్నను నట్టేట ముంచారు!
- రెండ్రోజుల్లో కాంటాలన్న హామీ ఏమైంది?
- నెక్కొండలో ఎమ్మెల్యే తీరుపై బీఆర్ఎస్ నేతల నిలదీత

నెక్కొండ మే1(ప్రభాత గమనం):

రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పుకునే స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి తీరు.. 'చెప్పేవి నీతులు – చేసేవి వంచనలు' అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. శుక్రవారం నెక్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు సంగాని సూరయ్య, సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్ అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా సంగాని సూరయ్య మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే మార్కెట్ యార్డుకు కలెక్టర్‌తో వచ్చి కేవలం రెండు రోజుల్లోనే కాంటాలు పూర్తి చేయించి మార్కెట్ ఖాళీ చేయిస్తానని ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. కానీ ఐదు రోజులు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, రైతులు అల్లాడిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మాట తప్పిన ఎమ్మెల్యేకు అంబేద్కర్ సెంటర్లో ఘనంగా సన్మానం చేయాలి" అంటూ ఆయన ఘాటుగా ఎద్దేవా చేశారు. గన్ని బ్యాగుల కోసం రైతులు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేదని మండిపడ్డారు.

### పోలీసుల పహారాలో పర్యటనలా?: కొమ్ము రమేష్ యాదవ్

సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పర్యటనలు రైతుల కోసం కాదని, కేవలం హంగామా కోసమేనని విమర్శించారు. నలుగురు ఎస్సైల బందోబస్తు మధ్య మార్కెట్‌కు వచ్చి రైతులకు అబద్ధపు హామీలు ఇచ్చి వెళ్లారని మండిపడ్డారు. "రైతులపై నిజంగా ప్రేమ ఉంటే, అధికారులను ఒప్పించి వెంటనే కాంటాలు మొదలు పెట్టించాలి. రైతు ఖాతాల్లో గన్ని సంచుల డబ్బులు జమ అయ్యేలా చూడాలి" అని డిమాండ్ చేశారు. సమస్యలు అడిగితే రైతులను బెదిరించడం ఎమ్మెల్యే అహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.

### ప్రజా క్షేత్రంలో నిలదీస్తాం..

ఇప్పటికైనా ఎమ్మెల్యే మాయమాటలు ఆపి, క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను తీర్చాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాటోత్ రమేష్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక సోమయ్య, కారింగుల సురేష్ గౌడ్, వాగ్య నాయక్, పొడిశెట్టి సత్యం, ఈదునూరి వెంకన్న, దేవానబోయిన వీరభద్రం, మాజీ సర్పంచ్‌లు మారంపల్లి కొమ్మాలు, బల్ల వెంకన్న, మాజీ ఎంపీటీసీ లింగ్య నాయక్, మాతంగి రాజు, ఊళ్లేరావు ప్రభాకర్, మాతంగి కిషోర్, ఒగ్గు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన

ప్రభాత గమనం వరంగల్ క్రైమ్ బ్యూరో :




ప్రజాపాలన ప్రగతిప్రణాళిక లో భాగంగా బయ్యారం మండలం ఉప్పలపాడు గ్రామం మరియు బోడగుట్ట తండ ప్రాంతాల్లో భరోసా ఎస్సై దీపిక తమ బృందం చే అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై దీపిక మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మాయమాటలు చెప్పి మహిళలు, యువతులను మోసాలకు గురిచేస్తున్న నేపథ్యంలో నేరాల నియంత్రణలో ప్రజలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. జాగ్రత్తగా వ్యవహరించడం ద్వారా నేరాలను నివారించవచ్చని వివరించారు. లింగ వివక్ష లేకుండా పిల్లల పెంపకం ఉండాలని, బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి పెట్టాలని తెలిపారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి 1930 టోల్ ఫ్రీ నంబర్ వినియోగించాలని తెలిపారు. తెలియని నంబర్ల నుండి మహిళలకు ఇబ్బందులు కలిగినప్పుడు లేదా ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భరోసా కేంద్రం విధులు, మహిళలు మరియు పిల్లలకు అందిస్తున్న సేవలు, పోక్సో చట్టంపై వివరించారు.

# ఘనంగా సాయితేజ జన్మదిన వేడుకలు

- బీఆర్ఎస్ ఆఫీస్ లో కేక్ కట్ చేసిన పార్టీ శ్రేణులు

**కేసముద్రం మే1(ప్రభాత గమనం):**

కేసముద్రం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కుమారుడు సాయితేజ్ జన్మదిన వేడుకలను శుక్రవారం నాడు నాయకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి సాయి తేజ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనాథ్ రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, పార్టీ ప్రధాన కార్యదర్శి కముటం శ్రీను, మున్సిపాలిటీ వార్డ్ కౌన్సిలర్లు ఆగెరాము,వినయ్ రెడ్డి, రాహుల్, సాయి, తరుణ్, సోలోమన్ తదితరులు పాల్గొన్నారు.



# వ్యక్తిపై కేసు నమోదు

- ధాన్యం కాంటాను ధ్వంసం చేసిన ఘటనలో..




**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

దేవరుప్పుల మండలం ధర్మ గడ్డ తండాలో కొనసాగుతున్న ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నీ యంత్రాలను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు. ధర్మగడ్డ తండాలో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సీరియల్ ప్రకారంగా తూకం వేసి మిల్లులకు తరలిస్తున్నారు . ఈ క్రమంలో శుక్రవారం కొనుగోలు కేంద్రానికి వచ్చిన మూడ మహేందర్ తన ధాన్యాన్ని తూకం వేయాలని సంబంధిత నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి తూకం వేసే కాంటన్, విద్యుత్ తీగలను ధ్వంసం చేశాడు. నిర్వాహకుల ఫిర్యాదుతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు



# ఘనంగా హరిప్రియ నాయక్ బర్త్ డే వేడుకలు

**గార్ల, మే 1, (ప్రభాత గమనం) :**

మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ జన్మదిన వేడుకలు శుక్రవారం మర్రిగూడెం వేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ముందుగా హరిప్రియ నాయక్ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. అభిమానులు మిఠాయిలు తినిపిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. "ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన హరిప్రియ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని" పలువురు నాయకులు ఆకాంక్షించారు.

# పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- ప్రవేశ పరీక్షల సందర్భంగా 163 సెక్షన్
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




భూపాలపల్లి జిల్లాలో మే 3వ తేదీన నిర్వహించబడనున్న నీట్ (యూజీ )–2026 ప్రవేశ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతలు కాపాడేందుకు సెక్షన్ 163 (భారతీయ నాగరిక సురక్షా సంహిత–2023) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రోజు మధ్యాహ్నం 12:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా నిలవడం నిషేధం. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదు. మైకులు, డీజేలు వినియోగించడం పూర్తిగా నిషేధం. పరీక్ష సమయంలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలి. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ బృందాల నియమిస్తూ ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా బృందాల ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, సంఘాల నాయకులు, తల్లిదండ్రులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.



# మాజీ మావోల వాదనలను చట్టాలుగా మారుస్తాం

- టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- మాజీల ఆమోదం పొందిన తర్వాతనే టీఆర్పీ మానిఫెస్టో
- పార్టీ మహిళా అధ్యక్షురాలిగా పటేల్ వనజక్క
- తీన్మార్ మల్లన్న నాయకత్వంలో పార్టీలోకి భారీగా మాజీ మావోయిస్టులు చేరిక

**హైదరాబాద్ మే1(ప్రభాత గమనం ) :**

మేడే పండుగ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి వివిధ జిల్లాల నుంచి వందలాది మంది మాజీ మావోయిస్టులు, ఉద్యమకారులు, న్యాయవాదులు మరియు యువకులు భారీగా చేరారు. పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో వీరంతా పార్టీ కండువా కప్పుకుని రాజ్యాధికార సాధన దిశగా అడుగులు వేశారు.

**పార్టీలో చేరిన ప్రముఖులు, నేతలు:**

ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి: ఖమ్మం నుంచి ఉపేంద్ర భాయ్, అలాగే 2017లో కాజీపేటలో రైలు పట్టాల మీద చనిపోయిన గోపన్న భార్య (తొర్రూరు మాజీ జెడ్పిటిసి) మల్లన్న నాయకత్వంలో పని చేయడానికి పార్టీలో చేరారు. హనుమకొండ నుంచి న్యాయవాది పద్మక్క, మంచిర్యాల నుంచి చిలువేరు రమ్య, ములుగు నుంచి అనసూర్య,స్వర్ణక్క తదితరులు మహిళల పక్షాన పోరాడేందుకు ముందుకొచ్చారు. 'భారత్ బచావో' ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రవీణ్, వరంగల్ జిల్లా నుంచి అనేక ఉద్యమాల్లో పాల్గొన్న దాడి రవన్న గారు పార్టీలో చేరారు. గతంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్లో పని చేసిన సంఘం సామన్న (వరంగల్), బాబన్న (రుద్రారం) తదితరులు మల్లన్నతో కలిసి నడవడానికి సిద్ధమై పార్టీలో చేరారు.తూమకుంట నుంచి రవి, మహబూబాబాద్ నుంచి భిక్షపతి యాదవ్, పృథ్వి, సరిత, కుషాయిగూడ నుంచి మార్కెట్ నాయకుడు ఎల్లన్న, బోయినపల్లి నుంచి రాజన్న యాదవ్, ఏపూరి నాగారం నుంచి సాయి కృష్ణ, మరియు వెంకంపల్లి నుంచి రమణ తదితరులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. రాజ్యాధికార పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నాయకులందరూ విరామం ఎరుగకుండా కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ జరగని విధంగా, అడవి నుంచి జనారణ్యంలోకి వచ్చిన మాజీ మావోయిస్టులు,సానుభూతిపరులు,అనుబంధ సంఘాల వారు మరియు ఉద్యమకారులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల గోదాలోకి దిగుతున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రకటించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అడవిలో ఏ ఆశయాల కోసమైతే వారు పోరాడారో, ఆ ఆశయాలను ప్రజాక్షేత్రంలో నెరవేర్చేందుకు టీఆర్పీ వేదికగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

**తీన్మార్ మల్లన్న ప్రస్తావించిన ముఖ్య అంశాలు:**

మహిళా అధ్యక్షురాలిగా పటేల్ వనజక్క: ఆరు నెలల క్రితం ప్రకటించిన విధంగానే, నేడు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సీనియర్ దళ కమాండర్, 'అడవి పుత్రిక' పుస్తక రచయిత్రి పటేల్ వనజక్క పార్టీలో లాంఛనంగా చేరారని ఆయన తెలిపారు. ఎన్నో కష్ట నష్టాలకోర్చి, బుల్లెట్ గాయాలను సైతం లెక్కచేయక పోరాడిన వనజక్క సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఇతర రాజకీయ పార్టీలన్నీ మావోయిస్టుల పేరును, వాళ్ళ సిద్ధాంతాలను కేవలం వాడుకున్నాయే తప్ప, వారిని అసెంబ్లీ గేటు దాటనివ్వలేదని మల్లన్న విమర్శించారు. కానీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోను మాజీ మావోయిస్టులకు ఇచ్చి, వారు ఆమోదించిన తర్వాతే ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళుతుందని ఆయన ధీమాగా ప్రకటించారు. మావోయిస్టులను అసెంబ్లీకి తీసుకువెళ్లాలని, వారి వాదనలు అసెంబ్లీ రికార్డులకు ఎక్కాలని, వారి గొంతు చట్టాలుగా మారాలన్నదే తమ పార్టీ ఏకైక ఉద్దేశమని స్పష్టం చేశారు. లెఫ్ట్ పార్టీలు కూడా కల్పించని వేదికను టీఆర్పీ కల్పించిందని, ఇది మెజారిటీ వర్గాల పార్టీ అని అన్నారు. "ఎవరి సొమ్ము ఎవడు తినొద్దు", "ఎవరెంతో వారికంత" అనేదే పార్టీ నినాదం మరియు పార్టీ గీతమని, జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి దక్కాలనే దృఢ సంకల్పంతో ఉన్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33% కాదు, 50% రిజర్వేషన్ ఇచ్చేందుకు కూడా తమ పార్టీ వెనకాడదని, తమ అక్కల రూపంలో తగినంత మంది నాయకులు దొరికారని మల్లన్న ప్రకటించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘమైన పాదయాత్రను చేపట్టబోతున్నట్లు తెలిపారు. సమావేశ హాలు సరిపోనందున భువనగిరితో పాటు పలుచోట్ల భారీ బహిరంగ సభలు నిర్వహించి పెద్ద ఎత్తున పార్టీ సైన్యాన్ని రిక్రూట్ చేసుకుంటామన్నారు.

**2029లో మనదే అధికారం**

ఒకప్పుడు అడవి బిడ్డలను ఎన్‌కౌంటర్ చేసి హింసించిన పోలీసులే, నేడు ప్రజాస్వామ్యబద్ధంగా వారు పెట్టుకున్న సభకు కాపలాగా ఉండటం ప్రజాస్వామ్యానికి ఉన్న బలాన్ని సూచిస్తుందన్నారు. 2029లో కచ్చితంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బీసీల ప్రభుత్వం ఏర్పడి తీరుతుందని మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. ఇతర రాజకీయ నాయకుల్లా వ్యాపార దృక్కోణంతో కాకుండా, ప్రజా దృక్కోణంతో తాము పనిచేస్తామని స్పష్టం చేశారు. మావోయిస్టుల సిద్ధాంతం తమ సిద్ధాంతం అని చెప్పిన కేసీఆర్ లాంటి నాయకులే తన హత్యకు కుట్ర చేశారని మల్లన్న ఆరోపించారు. అడవిలో అన్న ఏ విధంగా అయితే సర్వైవ్ అయ్యి ఉద్యమాన్ని నిర్మిస్తాడో, తాను కూడా అదే పోరాటాన్ని నిర్మిస్తున్నానని చెప్పారు. యుద్ధం ఇప్పుడే మొదలైందని, ప్రజల పక్షాన నిలబడే వారందరికీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

**బీజేపీలో చేరిక గురించి**

నాడు ఒక్కడినై నిరంకుశ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న తరుణంలో నా హత్యకు నాటి ప్రభుత్వ పెద్దలైన కెసిఆర్ కుట్ర చేయడంతో నన్ను నేను కాపాడుకొని సర్వైవ్ అవ్వడం కోసం బిజెపి పార్టీలో చేరడం జరిగిందని మాజీ మావోయిస్టుల ముందు స్పష్టం చేయడం జరిగింది... ఒకవేళ నేను ఆరోజు బిజెపి పార్టీకి వెళ్లకపోయి ఉంటే ఈరోజు నన్ను మీరు చూడకపోయేవారు అని నన్ను అంతమందించేందుకు పక్కా ప్రణాళికలు నాటి ప్రభుత్వం సిద్ధం చేసిందని తెలిపారు. అడవిలో ఉండి మీరు ప్రజల కోసం చేసిన పోరాటం మరువలేనిది. ఇంకా మిగిలిపోయి ఉన్న పోరాటాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పాల్గొని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వేదికగా మీ పోరాటాన్ని కొనసాగించడానికి ముందుకొచ్చిన మీ అందరికీ ధన్యవాదాలు... మీకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అన్ని వేళల అండగా ఉంటుందని మాజీ మావోయిస్టులను అసెంబ్లీకి తీసుకెళ్లే బాధ్యత నాదని ఈ సందర్భంగా మల్లన్న వారికి హామీ ఇచ్చారు...

**పటేల్ వనజక్క ప్రస్థానం..**

తాను భూపాలపల్లి ఏరియాలోని నాగారం అనే మారుమూల గ్రామంలో, ఒక వెనకబడిన దర్జీ (టైలర్) కుటుంబంలో పుట్టానని ఆమె తెలిపారు. పేదరికం వల్ల 16 ఏళ్ల వయసుకే చదువు మానేయాల్సి వచ్చిందన్నారు. 'నేను బీసీని, పటేల్ కాదు... పటేల్ సుధాకర్ రెడ్డిని వివాహం చేసుకున్నందుకే ఆ పేరు వచ్చింది" అని ఆమె స్పష్టం చేశారు. సమాజంలో అందరికీ బట్టలు కుట్టి మాన ప్రాణాలు కాపాడిన దర్జీలకు చట్టసభల్లో స్థానం లేదన్నారు. అలాంటి దర్జీ బిడ్డను గుర్తించి మల్లన్న మహిళా విభాగం బాధ్యతలు అప్పగించడం గర్వకారణం అన్నారు. తనతో పాటు కలిసి నడవడానికి వచ్చిన స్వర్ణక్క, స్వరూప, అనసూర్య, అడ్వకేట్ పద్మ, దేవేంద్రక్క, పావని, భారత్ బచావో సంస్థలో పనిచేసిన ప్రవీణ్ తదితరులను ఆమెతో వేదికను పంచుకున్నారు. ముగింపు మరియు భవిష్యత్ కార్యాచరణ: జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్, సాహూ మహారాజ్, పెరియార్ వంటి మహనీయుల స్ఫూర్తితో 'సామాజిక విప్లవం' తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో బీసీ మరియు బహుజన సమాజాన్ని రాజ్యాధికారం వైపు నడిపించడానికి మల్లన్న నాయకత్వంలో అందరూ కలిసి ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీ ఎత్తున మాజీ మావోయిస్టులు,ఉద్యమకారులు,సానుభూతిపరులు జిల్లాల వారీగా చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, అతి త్వరలోనే భువనగిరి వేదికగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఈ చేరికల కార్యక్రమం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

**పటేల్ వనజక్క మాట్లాడుతూ...**

పార్టీలో చేరిక వెనుక కారణం: తీన్మార్ మల్లన్న గారు పార్టీ పెట్టినప్పటి నుండి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టాలని తనను ఆహ్వానించారని, తన మిత్రులతో ఆరు నెలల పాటు చర్చించిన అనంతరం ఈ రోజు ఈ నిర్ణయం తీసుకున్నానని వనజక్క తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మనం మనుషులమేనా అన్న సందేహం కలుగుతుండటంతో, ఇక ఆలస్యం చేయడం సరికాదని ఆమె స్పష్టం చేశారు. బీసీల దుస్థితి మరియు రాజ్యాధికారం: ఈ సమాజంలో కుక్కలకు, నక్కలకు, చెట్లకు అన్నింటికీ లెక్కలు ఉన్నాయి కానీ, బీసీలకంటూ ఒక లెక్కగానీ, పత్రంగానీ లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా ఎన్నో పార్టీలు బీసీలను కులాల పేరుతో వంద రకాలుగా మోసం చేస్తూనే ఉన్నాయని, అందుకే బీసీల కోసం మల్లన్న నాయకత్వంలో ఒక కొత్త పార్టీ ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. అహోరాత్రులు శ్రమించి డా. బి.ఆర్. అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం నేడు కనుమరుగైపోయే పరిస్థితి వచ్చిందని, రాజ్యాంగాన్ని పక్కనపెట్టి 'మనువాదం' రాజ్యమేలుతోందని ఆమె విమర్శించారు. 93 శాతం జనాభా ఉన్న బడుగు, బలహీన వర్గాల ఓట్లతో, కేవలం 8 శాతం ఉన్నత వర్గాల వారు 78 ఏళ్లుగా ఎలా రాజ్యమేలుతున్నారని ఆమె సూటిగా ప్రశ్నించారు. సమాజంలో సగం ఉన్న మహిళల తరపున చట్టసభలలో సరైన ప్రాతినిధ్యం లేదని, భవిష్యత్తులో వచ్చే మహిళా రిజర్వేషన్లు కూడా ప్రస్తుతం ఉన్న పాలకుల ఇళ్లకే పోతాయన్న ఆందోళన వ్యక్తం చేశారు.

**తీన్మార్ మల్లన్నకు మద్దతు**

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా తీన్మార్ మల్లన్న ఉన్నారని కొనియాడారు. కేసీఆర్ ను ప్రశ్నించినందుకు మల్లన్నను జైల్లో పెట్టారని గుర్తుచేశారు. మల్లన్న కూడా బీజేపీలోకి వెళ్లారన్న ప్రచారం జరిగిందని, అయితే చిన్న చిన్న తప్పులను పట్టుకుని కోడిగుడ్డ మీద ఈకలు పీకడం మానేసి, ఆయనకు అందరూ అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. మల్లన్న తన సొంత ఇంటి కోసం కాకుండా బీసీలు, కింది వర్గాల విముక్తి కోసం ఆలోచిస్తున్నారని తెలిపారు. ప్రశ్నించేవాడు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో, బీజేపీ ప్రభుత్వం అడవులన్నీ కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. ఒక వంద సంవత్సరాల విప్లవోద్యమాన్ని మన కళ్ల ముందే సర్వనాశనం చేశారని, అడవి తల్లి రక్తం ఏరులై పారుతోందని ఆమె ఆవేదన చెందారు.

# మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రిలో దత్తత సహాయక కేంద్రం ప్రారంభం

- అనాథ శిశువులకు రక్షణగా 'ఊయల' పథకం
- దత్తతపై కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు
- అక్రమ దత్తతపై కఠిన చర్యలు హెచ్చరిక
- మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, మే 1 (ప్రభాత గమనం):**

మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో 'ఊయల' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ, కన్న పిల్లలను పెంచుకోలేని వారు లేదా వద్దనుకునే వారు వారిని చెత్త కుప్పల్లో, చెట్ల పొదల్లో వదిలేయకుండా ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన 'ఊయల'లో శిశువులను వదిలితే వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ చేపడతామని తెలిపారు. దత్తతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఐడీఓసీ కలెక్టరేట్‌లో దత్తత సహాయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం జరిగే 'ప్రజావాణి' కార్యక్రమానికి వచ్చే వారికి హెల్ప్‌డెస్క్ ద్వారా దత్తతకు సంబంధించిన పూర్తి సమాచారం, అవసరమైన పత్రాలు, ప్రభుత్వ మార్గదర్శకాలను అందజేస్తామని చెప్పారు. అంతర్జాతీయ, విదేశీ, బంధువుల ద్వారా జరిగే దత్తతల విషయంలో సరైన విధానం, నియమాలను పాటించాలని సూచించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు 'వాత్సల్య' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. అక్రమ దత్తతకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా దత్తతపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. చైల్డ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా 42 ప్రశ్నలతో వివరాలు సేకరించి, 7 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే అన్ని విభాగాలు పిల్లలు, మహిళలు, వృద్ధులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కట్టుబడి సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్, ఇంచార్జ్ సంక్షేమ అధికారి శిరీష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంఓ జగదీష్, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి , డీసీపీఓ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.






# మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**కేసముద్రం మే1(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలంలోని వివిధ గ్రామాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అభ్యుదయ సహకార సంఘం నాయకులు మార్కెట్ చైర్మన్ ను కోరారు. శుక్రవారం నాడు అభ్యుదయ కూరగాయలు, పండ్ల ఉత్పత్తి దారుల సహకార సంఘం నాయకుల ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతులు చాల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్ కు తీసుకుని రావడానికి డ్రాలో తీసిన ప్రకారం కొనుగోలు జరగక రైతులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మీరు ప్రకటించిన తేదీల ప్రకారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, మెట్టు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374